క్లుప్తంగా

రాష్ట్రస్థాయికి ఎంపిక


అభినందిస్తున్న హెచ్‌ఎం, పీఈటీ

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న 5గురు విద్యార్థులు ఈ నెల 4వ తేదీన మహబూబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి రగ్బీ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం శ్రీలత తెలిపారు. పదోతరగతి చదువుతున్న జంగా అర్చన, 9వ తరగతి చదువుతున్న మోరె సాయిశృతి ఈనెల 13 నుంచి 15 వరకు తొర్రూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, పీఈటీ కరిత, సర్పంచ్ రవి, ఎస్‌ఎంసీ చైర్మన్ రవీంద్రాచారి విద్యార్థులను అభినందించారు.

కంప్యూటర్ల బహూకరణ



పరకాల: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు పట్టణంలోని సీనియర్ వైద్యుడు వెంకటేశ్వర్లు దంపతులు రూ.1లక్ష విలువ చేసే కంప్యూటర్లను అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చక్రవర్తుల మధు, ఉపాధ్యాయులు ఆయకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వైద్య దంపతులకు ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు.

అనుమతి తప్పనిసరి

శాయంపేట : రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలైన సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు తమ ప్రచారాల నిమిత్తం వాల్ రైటింగ్, బ్యానర్లు, పోస్టర్లు అంటించేందుకు జిల్లా కలెక్టర్ నుంచి అనుమతి పొందాలని ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి గురువారం ప్రకటనలో సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం మధ్యాహ్నం 12 గంటల్లోపు వాల్ రైటింగ్, పోస్టర్లు, బ్యానర్లు తొలగించామని పేర్కొన్నారు. ఇప్పటి నుంచి ప్రచారాలకు జిల్లా కలెక్టర్ నుంచి అనుమతులు తీసుకోవాలని తెలిపారు. అనుమతి లేకుండా గోడలపై బ్యానర్లు, పోస్టర్లు అతికించినా, వాల్ రైటింగ్ కనిపించినా సంబంధిత బాధ్యుడిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మంద నరేష్‌కు మద్దతు



శాయంపేట : బహుజన సమాజ్‌వాజ్ పార్టీ నుంచి భూపాలపల్లి, పరకాల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి టికెట్ ఏబీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్‌కు కేటాయిస్తే మద్దతుగా నిలుస్తామని ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ నాగుల పవన్‌కల్యాణ్ వెల్లడించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాకతీయ యూనివర్సిటీ నుంచి విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న మంద నరేష్‌కు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అవకాశం కల్పించాలని కోరారు. మండల అధ్యక్షుడు తూర్పటి రాజ్‌కుమార్, కార్యదర్శి నజీర్, ఉపాధ్యక్షుడు అంబాల లక్ష్మణ్, అభివర్ధన్, మేకల అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 13న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. న్యూ శాయంపేట, హంటర్‌రోడ్డు, జులైవాడ, ప్రకాశ్‌రెడ్డి పేట, నంది హిల్స్, మచిలీబజార్, కాపువాడ, ఉజ్జిబేస్, వేయి స్తంభాల దేవాలయం, అలంకార్ సర్కిల్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

'టాస్' లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా అన్నపూర్ణ

వరంగల్ లీగల్: హనుమకొండ జిల్లా కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న గాదెపాక అన్నపూర్ణను తెలంగాణ అంబేడ్కర్ సంఘం (టాస్) లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా నియమిస్తూ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

ఉర్దూ జర్నలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు

న్యూశాయంపేట: హనుమకొండలో గురువారం జరిగిన సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఉర్దూ జర్నలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా మహ్మద్ అక్బర్ మెహియొద్దీన్, వర్కింగ్ అధ్యక్షుడిగా మిర్జా ఫతఉల్లాబేగ్, ఉపాధ్యక్షుడిగా మహ్మద్ ఫజల్ ఉర్ రహమాన్ వాజిద్, ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ ఇస్మాయిల్ జబీ, జాయింట్ సెక్రటరీలుగా సయ్యద్ సాదిఖ్ హుస్సేన్, మహ్మద్ అక్తర్ హుస్సేన్, కోశాధికారిగా మహ్మద్ హుస్సేన్ పాషా ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో

- పాఠశాలల్లో ముందస్తు వేడుకలు
- ఆడిపాడిన విద్యార్థినులు
- ఆకట్టుకున్న కోలాటాలు


ఆత్మకూరు : స్పెక్ట్రా స్కూల్‌లో..


వేలేరులో కోలాటం ఆడుతున్న చిన్నారులు


ఎల్కతుర్తి : ఆల్టిట్యూడ్ పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో గురువారం ముందస్తు బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. విద్యార్థినులు తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో సంప్రదాయ వస్త్రాలు ధరించి 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో' అంటూ ఆడిపాడారు. అనంతరం డీజే పాటలతో చిన్నారుల కోలాటా నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగని హెచ్‌ఎం పీడబ్ల్యూసీ పవన్‌కుమార్ అన్నారు. బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రంలోని టాకీస్ ఏరియా ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు బతుకమ్మ పండుగ ప్రపంచ ప్రఖ్యాతి పొందుతూ విశ్వ వ్యాప్తం అవుతోందన్నారు. అనంతరం విద్యార్థినులు ఆనందోత్సాహాల నడుమ బతుకమ్మ ఆడి, పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతి, కాంతయ్య, మమత, రవి, పద్మలత తదితరులు పాల్గొన్నారు.

దామెరలో..

దామెర: రానున్న సద్దుల బతుకమ్మ, దసరా పండుగలను ఆనందంగా జరుపుకోవాలని ఊరుగొండ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం నుంచి పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో గురువారం ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు తీరొక్క పూలతో బతుమ్మలను పేర్చి పాటలు పాడుతూ, కోలాటం ఆడుతూ నృత్యాలు చేశారు. ఉపాధ్యాయులు సునీత, విజయప్రభ, విద్యారాణి, విజయరాణి, రజిత, డాక్టర్ రాచర్ల గణపతి, రవీందర్‌రెడ్డి, సోమయ్య, శ్రీనివాస్, సురేందర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ధర్మసాగర్(వేలేరు)లో..

ధర్మసాగర్(వేలేరు) : మండలంలోని వివిధ గ్రామాల్లో గల ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం నుంచి దసరా సెలవులు ఉండడంతో ఉపాధ్యాయుల పర్య వేక్షణలో సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబంభించే విధంగా విద్యార్థినులు బతుకమ్మలను పేర్చి పాటలు పాడుతూ ఆనందంగా గడిపారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రాజన్న, చంద్రమౌళి, లీలాభాయి, గణపతినాయక్, తిరుపతి, తెలుగు ఉపాధ్యాయులు ఉమాదేవి, కోటేశ్వర్, కుమారస్వామి ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు జరిగాయి. ఉపాధ్యాయులు తబిత, రాధిక, వసంత, రాణి, లీలారాణి, సుజాత, మాధవి, విజయ, సీఆర్పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు: మండల కేంద్రంలోని స్పెక్ట్రా స్కూల్, సెయింట్ థెరిస్సా, జెడ్పీహెచ్‌ఎస్‌తో పాటు మండలంలోని పలు పాఠశాలల్లో గురువారం ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థినులు బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు. శుక్రవారం నుంచి పాఠశాలలకు సెలవులు కావడంతో ముందస్తు వేడుకలు నిర్వహించారు.

ఐనవోలులో..

ఐనవోలు: ప్రకృతిని ఆరాధించే విశిష్ట సంస్కృతికి ప్రతిబింబమే బతుకమ్మ అని ఉపాధ్యాయులు అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలతో పాటు కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు బతుకమ్మ నేపథ్యం, చారిత్రక అంశాలను విద్యార్థులకు తెలియజేశారు. పండుగలో ఉన్న శాస్త్రీయ కోణాన్ని వివరించారు. బతుకమ్మ పేర్చే క్రమంలో పసుపు, గునుగు, తంగేడు, గుమ్మడి, మందార, బంతి తదితర రకాల ఔషద గుణాలు కలిగిన పూలు వినియోగిస్తారని, వాటి ప్రాముఖ్యతను తెలిపారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, లింగారావు, సునీత, బీమళ్ల సారయ్య, మధుకర్, మహేందర్‌రెడ్డి, లక్ష్మయ్య, ఉమాదేవి, సత్యవాణి, రేవతి పాల్గొన్నారు.

పరకాలలో..

పరకాల: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో బతుకమ్మ వేడుకల కోలాహలం నెలకొంది. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చిన విద్యార్థులు బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులతో కలిసి బతుకమ్మ ఆడారు. నేటి నుంచి దసరా సెలవులు కావడంతో బతుకమ్మ తో రావణసురవధ వంటి కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బతుకమ్మ ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు వివరించారు. ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.


ఎల్కతుర్తి: భీమదేవరపల్లి జెడ్పీహెచ్‌లో..


కమలాపూర్ : బతుకమ్మలతో చిన్నారులు


దామెర: ఊరుగొండ పాఠశాలలో..


ఐనవోలు: కేజీబీవీలో..


ఐనవోలు : ప్రభుత్వ పాఠశాలలో..


పరకాల : శారదా విద్యాలయంలో..

ఆటో డ్రైవర్ నిజాయితీ


బాధితురాలికి బ్యాగు అప్పగిస్తున్న ఎస్సై లలిత

కాజీపేట: బంగారు నగలతో పాటు విలువైన కాగితాలను మరిచిపోయిన బాధితురాలికి పోలీసుల సమక్షంలో బ్యాగును అందించి ఆటో డ్రైవర్ తన నిజాయితీని చాటుకున్నాడు. గురువారం ట్రైసిటీ ఆటో యూనియన్ నాయకుడు అరూరి రవీందర్ ఆటోలో హనుమకొండ నుంచి ప్రయాణించిన ఓ మహిళ తన వెంట తెచ్చుకున్న బ్యాగును మరిచిపోయి హడావిడిగా కాజీపేట చౌరస్తాలో దిగిపోయింది. ఈ తర్వాత ఆటోలో బ్యాగు ఉన్నట్లు రవీందర్ గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై లలితకు అప్పగించారు. అనంతరం బాధితురాలికి అందజేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో సీఐ సార్ల రాజు, ముచ్చు భిక్షపతి, జేరిపోతుల వెంకన్న, బండి రాంచందర్, సందెల పైడి, ఎండీ.సోని, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీ విజిల్ యాప్‌ను తెలుగులో అందించాలి

హన్మకొండ: ఎన్నికల్లో జరిగే అక్రమాలు, కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదు చేసేందుకు తీసుకువచ్చిన సీ – విజయ్ యాప్‌ను తెలుగులో కూడా అందించాలని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ కోరారు. ఈమేరకు ఎన్నికల కమిషన్, రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా విన్నవించారు. ఎన్నికల నిబంధనల అతిక్రమణలు ఫిర్యాదు చేయడానికి సీ – విజిల్ చాలా ఉపయోగకరమైన యాప్ అని పేర్కొన్నారు. ఈ యాప్ 8 భాషల్లో అందుబాటులో ఉందని, అయితే తెలుగు భాషలో మాత్రం అందుబాటులో లేదని తెలిపారు. దక్షిణ భారతదేశంలో కన్నడ, మలయాళం, తమిళ భాషల్లో అందుబాటులో ఉన్నప్పుడు తెలుగులో ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు.

బెల్ట్ షాపులపై దాడులు

కాజీపేట: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈక్రమంలో కాజీపేటలోని బెల్ట్‌షాపులపై గురువారం దాడులు ముమ్మరం చేశారు. ఈ దాడుల్లో సుమారు రూ.10 వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసులు నమోదు చేశామన్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్, సీఐ సార్ల రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధే కేసీఆర్ పాలనకు చిరునామా

- బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి


మాట్లాడుతున్న కడియం శ్రీహరి

ధర్మసాగర్: రాష్ట్రంలో ప్రతి గ్రామం, ప్రతి పల్లె పచ్చగా కనిపిస్తుందని, ఆ గొప్పదనం సీఎం కేసీఆర్ పాలనకు చిరనామాగా నిలుస్తోందని స్టేషన్‌ఘన్‌పూర్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని మల్లక్‌పల్లి, ధర్మపురం గ్రామాల్లో గురువారం బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించి మాట్లాడారు. దేశంలోని 28 రాష్ట్రాల్లో జరగని అభివృద్ధి, సంక్షేమం తెలంగాణ రాష్ట్రంలోనే జరుగుతుందన్నారు. గత ప్రభుత్వాలు పాలించిన 70 సంవత్సరాల్లో జరగని అభివృద్ధి బీఆర్‌ఎస్ పాలించిన కేవలం తొమ్మిదిన్నర సంవత్సరాల్లో సీఎం కేసీఆర్ చేసిచూపించారని అన్నారు. రైతుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, వ్యవసాయం పండుగలా మారిందన్నారు. రైతులు, సబ్బండ వర్గాలు కేసీఆర్ కేసీఆర్‌కు అండగా నిలవాలని కోరారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీకే గ్యారంటీ లేదని, అలాంటిది ఆరు గ్యారంటీలు ఇస్తామంటూ ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేయాలని చూస్తే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో తాను ఈస్థాయిలో ఉన్నానని, మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గుర్‌రెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీ పిట్టల శ్రీలత, సర్పంచ్‌లు మునిగెల రాజు, మునిగాల యాకుబ్, ఎంపీటీసీ బీంరెడ్డి కరుణాకర్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కరంచంద్, పీఏసీఎస్ డైరెక్టర్ అమరేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ పాటు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

దళితుల అంశాలను మేనిఫెస్టోలో చేర్చాలి


సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

హన్మకొండ: దళితుల సాధికారతకు ఉపయోగపడే అంశాలు, చేపట్టే పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ అన్నారు. హనుమకొండలో దళిత బహుజన ఫ్రంట్, ప్రజా సంఘాల ముఖ్య నాయకుల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, విశ్వవిద్యాలయాల పట్ల వివక్షను విడనాడలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, గురుకులాల్లో కనీస సదుపాయాలు కల్పించాలని కోరారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత నాణ్యమైన విద్యనందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కేయూ జేఏసీ చైర్మన్ డాక్టర్ మంద వీరస్వామి, దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్, ఉపాధ్యక్షుడు సిలువేరు భిక్షపతి, రాష్ట్ర మహిళా కార్యదర్శి బొర్ర సంపూర్ణ, నాయకులు కొమ్ముల కరుణాకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే చర్చకు రావాలి

- మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి


ఊరుగొండ రోడ్ షోలో మాట్లాడుతన్న భిక్షపతి

దామెర: దళితబంధు, బీసీబంధు పథకాలను నియోజకవర్గంలో ఎంతమందికి ఇచ్చారో స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి చిత్తశుద్ధి ఉంటే చర్చకు రావాలని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి సవాల్ విసిరారు. మండలంలోని ఊరుగొండలో గురువారం ఇంటింటా ప్రచారం, రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చేసిన అభివృద్ధి శూన్యమని ఆరోపించారు. గృహలక్ష్మి పేరుతో ఇళ్లకు ముగ్గు పోయించి లబ్ధిదారులకు రూపాయి ఇవ్వకుండా చేతులు దుపుకున్నారని అన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో బీఆర్‌ఎస్ పార్టీ నేతలు జిమ్మిక్కులు చేస్తూ ప్రజలను మోసం చేస్తే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ ఎన్ని మాయమాటలు చెప్పినా ప్రజలు నమ్మరని అన్నారు. మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధిలో దూసుకుపోతుందని, ఒకసారి అవకాశమిస్తే రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెడతామని అన్నారు. నాయకులు డాక్టర్ పగడాల కాశీప్రసాదరావు, మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు, జిల్లా కిసాన్‌మోర్చ ఉపాధ్యక్షుడు గంకిడి బుచ్చిరెడ్డి, మండల కార్యదర్శి ముత్యాల శేఖర్, మండల ఉపాధ్యక్షుడు దాంసాని శ్రీనివాస్‌రెడ్డి, మండల కార్యదర్శి ముత్యాల రాజశేఖర్, దళిత మోర్చ అధ్యక్షుడు చేరాలు, బూత్ అధ్యక్షులు సమ్మిరెడ్డి, పరుశరాం పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు


ఐనవోలు : ప్రమాదంలో గాయపడ్డ మహిళ


పరకాల : గాయలైన సంపత్

ఐనవోలు: ఆగి ఉన్న ఆటోను మరో ఆటో ఢీకొట్టగా ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని పున్నేలు క్రాస్ వరంగల్–ఖమ్మం రహదారిపై గురువారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కొడకండ్ల గ్రామానికి చెందిన సాయిని ఉపేందర్, సాయిని మల్లేశ్వరి ఆటోలో వరంగల్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో పున్నేలు క్రాస్ వద్ద ఆగిఉన్న ఆటోను వీరు ప్రయాణిస్తున్న ఆటో వెనుభాగం నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. అటుగా వెళ్తున్న కాంగ్రెస్ పార్టీ నుంచి వర్ధన్నపేట అసెంబ్లీ టికెట్‌ను ఆశిస్తున్న పరంజ్యోతి క్షతగాత్రులను అంబులెన్స్‌లోకి ఎక్కించేందుకు సాయం చేశారు. ఈ ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

పరకాలలో గీతకార్మికుడు..

పరకాల: ఈత చెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మాదారం తాటివనంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మార్క సంపత్ వృత్తిలో భాగంగా గురువారం ఈతచెట్టు ఎక్కుతున్న క్రమంలో జారి పడ్డాడు. గమనించిన గీతకార్మికులు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలు అయినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

వయోజన విద్యతో అక్షరాస్యత పెంపు

కాజీపేట అర్బన్: నిరక్షరాస్యుల్లో అక్షరాస్యతను పెంపొందించేందుకు వయోజన విద్యా కేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని రెవరెండ్ పాస్టర్ బొందుగుల కరుణాకర్ తెలిపారు. కాజీపేట మండలం కొత్తపల్లి గ్రామంలో స్ఫూర్తి సేవా సదన్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన ఐదు వయోజన విద్యా కేంద్రాలను కరుణాకర్ ప్రారంభించి మాట్లాడారు. నేటి సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు అక్షరాస్యతను పెంపొందించేందుకు, స్వీయ ఉపాధి కల్పించేందుకు అక్షరం జ్ఞానం తోడ్పడుతుందని చెప్పారు. ప్రవీణ్‌కుమార్, పోలెపాక సబిత, వెంకటస్వామి, స్వప్న, సంధ్య, యుగందర్, రజనీకర్‌రెడ్డి, స్వామి పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి


మాట్లాడుతున్న జైపాల్‌రెడ్డి

ఆత్మకూరు: అకాల వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోగా వారికి పరిహారం చెల్లిస్తామని చెప్పిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం హామీని నిలబెట్టుకోలేకపోయిందని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు రేవూరి జైపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు పంటనష్ట పరిహారం కోసం ఎదురుచూసి విసిగిపోయారన్నారు. అదే విధంగా 90శాతం మంది రైతులకు ఇప్పటి వరకూ రుణమాఫీ కాలేదన్నారు. సీఎం కేసీఆర్ చెప్పిన ఉచిత ఎరువులు పంపిణీ ఎమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వాసు, నాయకుడు అలువాల రవి పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

ఆత్మకూరు: మండలంలో అక్రమ మద్యం విక్రయించేందుకు బెల్టుషాపులను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రవిరాజు హెచ్చరించారు. మండలంలోని అగ్రంపహాడ్‌లో బుధవారం రాత్రి బెల్టుషాపుపై దాడులు చేసి రూ.17వేల విలువ చేసే 38 లీటర్ల మద్యంను ఎస్సై ప్రసాద్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బెల్ట్‌షాపు నిర్వాహకుడు ఎడ్ల కోమల్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో బెల్టుషాపులు ఏర్పటు చేసి మద్యం విక్రయిస్తే చట్టరంగా కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామన్నారు. దొంగచాటుగా బెల్టుషాపులపై జీవిస్తున్న వారు ఇతర ఉపాధి చూసుకోవాలని సూచించారు. పట్టుబడితే కేసుల పాలవుతారని హెచ్చరించారు.

లక్ష్యాన్ని ఎంచుకొని చదువుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న శర్మ

మామునూరు: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని ప్రొఫెసర్, డీన్ ఎస్‌ఎస్‌వీఎన్ శర్మ, వైస్ ప్రిన్సిపాల్, డాక్టర్ తిరుపతిరావు, డాక్టర్ కళాశాల డీన్ ఎం.శశిధర్, డాక్టర్ శివశంకర్ సూచించారు. ఈమేరకు ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి కళాశాలలో డాక్టర్ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో నూతన ప్రవేశాల పొందిన ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలోని వనరులను ఉపయోగించుకుని విద్యార్థులు తమ జీవిత లక్ష్య సాధన కోసం మరింతగా కష్టపడాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.మురళి, డాక్టర్ సరోజ, ముక్తేశ్వర, డాక్టర్ భార్గవి, డాక్టర్ స్రవంతి, డాక్టర్ వేణురెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

'మార్క్స్ - అంబేడ్కర్ మన మార్గదర్శకులు'


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న చంద్రమౌళి

హన్మకొండ: లాల్ నీల్ మైత్రి వేదిక ఆధ్వర్యంలో ఈనెల 15న మార్క్స్ – అంబేడ్కర్ మన మార్గదర్శకులు అనే పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు లాల్ నీల్ మైత్రి వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ చంద్రమౌళి తెలిపారు. హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సదస్సు, పుస్తకావిష్కరణ కార్యక్రమ కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగే సదస్సులో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. సదస్సులో వివిధ అంశాలపై ప్రొఫెసర్ అబ్దుల్ నూర్ బాషా, డాక్టర్ ఎంఎఫ్.గోపినాథ్, బొజ్జ భిక్షమయ్య, జిలకర శ్రీనివాస్ ప్రసంగిస్తారని వివరించారు. డాక్టర్లు వెంగల్‌రెడ్డి, మార్క శంకర్ నారాయణ, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.